సాక్షి
తూర్పుగోదావరి

బుధవారం ⋮ 15 ⋮ అక్టోబర్ ⋮ 2025



రూ.లక్ష విరాళం


సామర్లకోట: పెద్దాపురం మండలం చదలాడ తిరుపతి శృంగార వల్లభస్వామి ఆలయంలో నిత్యాన్న దాన పథకానికి బడ్డేపు లక్ష్మీపార్వతి (విశాఖపట్నం) మంగళవారం రూ.లక్ష విరాళం సమర్పించారు.



సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి..

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి జి.శ్రీమన్నారాయణ, లక్ష్మి దంపతులు (హైదరాబాద్) మంగళవారం రూ.1,00,051 విరాళం సమర్పించారు.

కడలిలోకి 3.49 లక్షల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం 3,49,351 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 2,700, మధ్య డెల్టాకు 1,400, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 10.90, భద్రాచలం వద్ద 21 అడుగులుగా నీటిమట్టాలు నమోదయ్యాయి.

న్యూస్‌రీల్

విద్యుత్ సమ్మె నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): విద్యుత్ ఉద్యోగుల సమ్మె నేపథ్యంలో జిల్లాలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరిగేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఈపీడీసీఎల్ ఎస్ఈ కె.తిలక్ కుమార్ మంగళవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా ఎదుర్కొనేందుకు నోడల్ అధికారులను నియమించామన్నారు. జిల్లా స్థాయిలో 0883–2463354, 73822 99960 (రాజమహేంద్రవరం) నంబర్‌తో కంట్రోల్ రూము ఏర్పాటు చేశామన్నారు. అలాగే, డివిజన్ స్థాయిలో 94906 10093 (రాజమహేంద్రవరం టౌన్), 94931 78862 (రాజమహేంద్రవరం రూరల్), 83329 73595 (నిడదవోలు), 94408 12583 ఎస్ఈ (ఆపరేషన్ సర్కిల్ – రాజమహేంద్రవరం), 94408 12584 (ఈఈ, టెక్నికల్, సర్కిల్ ఆఫీస్, రాజమహేంద్రవరం), 94408 12585 (ఈఈ, ఆపరేషన్ డివిజన్, రాజమహేంద్రవరం టౌన్), 73825 85487 (ఈఈ, ఆపరేషన్ డివిజన్, రాజమహేంద్రవరం రూరల్), 94408 12706 (ఈఈ, ఆపరేషన్ డివిజన్, నిడదవోలు) నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఇసుక సరఫరాలో చట్టబద్ధత తప్పనిసరి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఇసుక తవ్వకాలు, రవాణా, సరఫరాలో పారదర్శకత, చట్టబద్ధత తప్పనిసరని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. జిల్లాలోని 29 స్టాక్ పాయింట్లలో మొత్తం 9,96,736 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉండగా, ఇప్పటి వరకూ 5,20,397 మెట్రిక్ టన్నులు వినియోగమైందని చెప్పారు. ప్రస్తుతం 4,76,339 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. ఇతర జిల్లాలకు కేటాయించిన 8 స్టాక్ పాయింట్లలో 3,92,434 మెట్రిక్ టన్నులకు గాను 49,914 మెట్రిక్ టన్నులు వినియోగమైందని, మరో 3,42,520 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని తెలిపారు. తదుపరి ఆదేశాలు ఇచ్చేంత వరకూ ఓపెన్ రీచ్‌లలో డీ–సిల్టేషన్ తవ్వకాలకు అనుమతులు ఇవ్వబోమని కలెక్టర్ కీర్తి స్పష్టం చేశారు. సమావేశంలో జేసీ వై.మేఘస్వరూప్, అదనపు ఎస్పీ డి.మురళీకృష్ణ, జిల్లా మైన్స్ అధికారి డి.ఫణిభూషణ్‌రెడ్డి, ఆర్డీఓలు ఆర్.కృష్ణనాయక్, రాణి సుస్మిత తదితరులు పాల్గొన్నారు.

17న జిల్లా స్థాయి సైన్స్ సెమినార్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): 'క్వాంటమ్ ఏజ్ బిగిన్స్ పొటెన్షియల్స్ అండ్ ఛాలెంజెస్' అనే అంశంపై ఈ నెల 17న జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ జరగనుందని జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోటిపల్లి బస్టాండ్ వద్ద ఉన్న ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఈ సెమినార్ నిర్వహిస్తున్నామన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని 8, 9, 10వ తరగతి విద్యార్థులు దీనిలో పాల్గొనవచ్చన్నారు. ప్రతి పాఠశాల నుంచి ఒక విద్యార్థి మాత్రమే పాల్గొనాలని, ఎంఈఓలు 16వ తేదీన మండల స్థాయిలో పోటీలు నిర్వహించి, వేర్వేరు పాఠశాలలకు చెందిన ఇద్దరు విద్యార్థులను జిల్లా స్థాయికి పంపాలని సూచించారు. ఇందులో ప్రతిభ చూపిన వారు 18వ తేదీన విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి సెమినార్‌లో పాల్గొంటారన్నారు.

లో గ్రేడ్.. వెరీ బ్యాడ్

- మందకొడిగా లో గ్రేడ్ పొగాకు అమ్మకాలు
- 4 మిలియన్ కిలోల ఉత్పత్తి అంచనా
- కొనుగోలుకు ఆసక్తి చూపని వ్యాపారులు
- కిలో ధర రూ.70
- అయోమయంలో రైతులు



దేవరపల్లి వేలం కేంద్రానికి అమ్మకానికి వచ్చిన లో గ్రేడ్ పొగాకు బేళ్లు

దేవరపల్లి: వ్యాపారులు పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో మార్కెట్లో లో గ్రేడ్ పొగాకు అమ్మకాలు మందకొడిగా జరుగుతున్నాయి. గత ఏడాది కొనుగోలు చేసిన లో గ్రేడ్ పొగాకు ఇప్పటికీ వ్యాపారుల వద్ద నిల్వ ఉండిపోయింది. ఈ ప్రభావం ఈ ఏడాది మార్కెట్‌పై పడిందని టుబాకో బోర్డు అధికారులు చెబుతున్నారు. రైతుల వద్ద ఉన్న నాణ్యమైన (బ్రైట్) గ్రేడ్ పొగాకు అమ్మకాలు దాదాపు పూర్తయ్యాయి. ఇక లో గ్రేడ్ పొగాకు మాత్రమే అమ్ముకోవలసి ఉంది. కానీ, దీనిని అడిగే నాథుడే లేకపోవడంతో రైతులు అయోమయంలో పడ్డారు.

రూ.150 ఇవ్వాలి

ఈ ఏడాది లో గ్రేడ్ పొగాకు కొనుగోలుకు వ్యాపారులు మొదటి నుంచీ అంతగా ఆసక్తి చూపలేదు. దీంతో, చివరిలో అమ్ముకోవచ్చునే ఉద్దేశంతో



రైతులు దీనిని నిల్వ చేశారు. పొగాకు కొనుగోళ్లు ముగింపు దశకు చేరుకోవడంతో ప్రస్తుతం తమ వద్ద ఉన్న లో గ్రేడ్ పొగాకును వేలం కేంద్రాలకు తీసుకు వస్తున్నారు. అయితే, రెండు మూడు కంపెనీలు మాత్రమే తమకు నచ్చిన లో గ్రేడ్ పొగాకును మొక్కుబడిగా కొనుగోలు చేస్తున్నాయని వాపోతున్నారు. 2023–24లో లో గ్రేడ్‌కు మంచి డిమాండ్ ఏర్పడింది. కిలో రూ.170 వరకూ అమ్ముడు పోయింది. 2024–25లో కిలో రూ.130 నుంచి రూ.140కి అమ్ముడవడంతో మంచి రేటు వచ్చిందని రైతులు సంతోషించారు. ఈ ఏడాది ప్రస్తుతం కిలో రూ.70 నుంచి రూ.80కి మాత్రమే అమ్ముడు పోతోందని చెబుతున్నారు. ఈ ధర గిట్టుబాటు కాదని, కనీసం రూ.150 ఇవ్వాలని కోరుతున్నారు.

4 మిలియన్ కిలోల ఉత్పత్తి

పొగాకు బోర్డు రాజమహేంద్రవరం రీజియన్ పరిధిలోని ఐదు వేలం కేంద్రాల్లో 2024–25 పంట కాలంలో సుమారు 4 మిలియన్ కిలోల లో గ్రేడ్ పొగాకు ఉత్పత్తి అయినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఒక్కో వేలం కేంద్రంలో 5 లక్షల నుంచి 6 లక్షల కిలోల లో గ్రేడ్ పొగాకు ఉత్పత్తి జరిగిందన్నది వారి అంచనా. ఒంగోలు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని దక్షిణాది వేలం కేంద్రాల ప్రాంతాల్లో నాణ్యమైన లో గ్రేడ్ పొగాకు తక్కువ ధరకు దొరుకుతోంది. దీంతో, ఇక్కడి ఉత్తర తేలిక నేలల (ఎన్ఎల్ఎస్) ప్రాంతంలోని లో గ్రేడ్ పొగాకు కొనుగోలుకు వ్యాపారులు ముందుకు రావడం లేదని అధికారులు అంటున్నారు. దక్షిణాది వేలం కేంద్రాల్లో కిలో రూ.60 నుంచి రూ.80 ధర పలుకుతోంది. ఎగుమతులకు అవసరమైన నికోటిన్ శాతం ఉన్న పొగాకు ఉత్పత్తి ఆ ప్రాంతాల్లో జరిగింది. ఎన్ఎల్ఎస్ ప్రాంతంలో నికోటిన్ శాతం తక్కువగా ఉందని వ్యాపారులు అంటున్నారు. అక్కడ, ఇక్కడ దాదాపు ఒకే ధర పలుకుతున్నప్పటికీ, ఇక్కడ కొనుగోలు చేసిన పొగాకును గుంటూరు ప్రాంతానికి తరలించేందుకు రవాణా ఖర్చులు ఎక్కువవుతున్నాయని చెబుతున్నారు. అయితే, లో గ్రేడ్ పొగాకు గ్రేడింగ్‌లో రైతులు అశ్రద్ధ చూపారని, మిక్సింగ్ గ్రేడ్ ఎక్కువగా ఉండటంతో కొనుగోలుదారులు ఇష్టపడటం లేదని అధికారులు అంటున్నారు. ఎవరి వాదన ఎలా ఉన్నా ఈ ఏడాది లో గ్రేడ్ పొగాకు అమ్ముకోవడానికి రైతులు నానా అవస్థలూ పడుతున్నారు.

రూ.2,376 కోట్ల పొగాకు విక్రయాలు

పొగాకు బోర్డు రాజమహేంద్రవరం రీజియన్ పరిధిలోని ఐదు వేలం కేంద్రాల్లో ఈ సీజన్‌లో ఇప్పటి వరకూ రూ.2,376 కోట్ల విలువైన 73.01 మిలియన్ కిలోల పొగాకు విక్రయాలు జరిగాయి. మొత్తం 5,78,919 బేళ్ల అమ్మకాలు జరిగాయని బోర్డు రీజినల్ మేనేజర్ జీఎల్‌కే ప్రసాద్ తెలిపారు. ఎన్ఎల్ఎస్ పొగాకు 69.70 మిలియన్ కిలోలు, బ్లాక్ సాయిల్ పొగాకు 3.31 మిలియన్ కిలోల మేర అమ్మకాలు జరిగాయన్నారు. 2024–25 పంట కాలానికి 59 మిలియన్ కిలోల ఉత్పత్తికి అనుమతి ఇవ్వగా, 84 మిలియన్ల కిలోల పంట పండించారని తెలిపారు. కిలోకు గరిష్టంగా రూ.427, కనిష్టంగా రూ.70, సగటున రూ.310.71 చొప్పున ధర పలికిందని వివరించారు. బ్లాక్ సాయిల్ పొగాకు కిలో సగటు ధర రూ.237.44 లభించిందన్నారు. మరో నెల రోజులు కొనుగోళ్లు జరిగే అవకాశం ఉందని, రైతుల వద్ద దాదాపు 12 మిలియన్ల కిలోల పొగాకు అమ్మకానికి ఉందని చెప్పారు. ఈ ఏడాది ఇప్పటి వరకూ 164 రోజుల పాటు వేలం ప్రక్రియ జరిగిందన్నారు.

రైతులు స్వీయ నియంత్రణ పాటించాలి



రైతులు పొగాకు సాగులో స్వీయ నియంత్రణ పాటించాలి. పరిమితికి లోబడి మాత్రమే వచ్చే ఏడాదికి పండించాలి. బోర్డు నిబంధనలు చాలా కఠినతరంగా ఉన్నాయి. రిజిస్ట్రేషన్ లేకుండా పొగాకు సాగు చేయవద్దు. రిజిస్ట్రేషన్ లేకుండా నిర్మించిన బ్యారన్లను తొలగించాలి. అటువంటి బ్యారన్లలో పొగాకు క్యూరింగ్ చేయబోమని బోర్డుకు రైతు అఫిడవిట్ ఇవ్వాలి. అఫిడవిట్ ఇచ్చిన తర్వాత బ్యారన్ వినియోగిస్తే పొగాకు అమ్మకాలను నిలుపు చేస్తాం. లో గ్రేడ్ పొగాకు కొనుగోళ్లు మందకొడిగా ఉన్నాయి. కొనుగోలుదారులు ఆసక్తి చూపడం లేదు. లో గ్రేడ్ పొగాకు గ్రేడింగ్ సరిగా లేదు. మిక్సింగ్ గ్రేడ్‌లు ఉన్నందున ధర పలకడం లేదు.

– జీఎల్‌కే ప్రసాద్, పొగాకు బోర్డ్ రీజినల్ మేనేజర్, రాజమహేంద్రవరం

విద్యార్థులకు కౌశల్ క్విజ్ పోటీలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం సిటీ): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల ప్రతిభాపాటవాలు, సైన్స్ పరిజ్ఞానాన్ని వెలికి తీసేందుకు కౌశల్ క్విజ్ పోటీలు దోహదపడతాయని కౌశల్ క్విజ్ రాష్ట్ర జాయింట్ కోఆర్డినేటర్ మేకా సుసత్యరేఖ తెలిపారు. భారతీయ విజ్ఞాన మండలి, అప్కాస్ట్ సైన్స్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యాన కౌశల్ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలు నవంబర్ 1న పాఠశాల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ నాలుగు విభాగాలుగా జరుగుతాయన్నారు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ విజేతలకు నగదు బహుమతులు అందజేస్తారన్నారు. పాఠశాల స్థాయిలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తారన్నారు. వారిలో ఒక్కో తరగతికి ముగ్గురిని మాత్రమే ఎంపిక చేయాలని, రీల్స్ పోటీలకు పదో తరగతి విద్యార్థులు మాత్రమే అర్హులని తెలిపారు. పోస్టర్ పోటీలు–1కు 9వ తరగతి, పోస్టర్ పోటీలు–2కు 8వ తరగతి విద్యార్థులు అర్హులన్నారు. ఈ రెండు విభాగాల్లో చెరో ఇద్దరినీ ఎంపిక చేయాలని చెప్పారు. ఎంపికైన విద్యార్థులు స్కూల్ లెవెల్‌లో ఆన్‌లైన్ పరీక్ష రాయాల్సి ఉంటుందన్నారు. క్విజ్ పోటీలకు ఎస్‌సీఈఆర్‌టీ సిలబస్ అక్టోబర్ వరకూ ఉంటుందని, పాఠశాల స్థాయిలో నిర్వహించే పరీక్షలో ప్రతి తరగతి నుంచి క్విజ్, రీల్స్, పోస్టర్–1, పోస్టర్–2కు ఒక్కో దానికి 20 మంది చొప్పున జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని వివరించారు.

ఐటీఐలో మిగిలిన సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం రూరల్: ఐటీఐలలో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి గాను ఐదో విడత అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. రాజమహేంద్రవరం ఐటీఐ ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఎలక్ట్రానిక్స్, మెకానిక్ ట్రేడ్‌లలో మిగిలిన 10 సీట్లు భర్తీ చేస్తామన్నారు. అభ్యర్థులు అన్ని ధ్రువపత్రాలతో ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 16వ తేదీ ఉదయం 11 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారు అదే రోజు మధ్యాహ్నం 4 గంటల్లోగా ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఒక జత జిరాక్స్ కాపీలతో ఐటీఐలో వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. పూర్తి వివరాలకు ప్రభుత్వ ఐటీఐని సంప్రదించాలని కోరారు.

మళ్లీ పోటెత్తిన ఎర్ర కాలువ



కంసాలిపాలెం - మాధవరం మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న ఎర్ర కాలువ

నిడదవోలు రూరల్: భారీ వర్షాలకు ఎర్ర కాలువ మరోసారి పోటెత్తింది. ఎగువ నుంచి భారీగా వరద నీరు రావడంతో నిడదవోలు మండలం కంసాలిపాలెం – మాధవరం వంతెన వద్ద మంగళవారం ఉదయం నుంచీ ప్రవాహ ఉధృతి క్రమేపీ పెరుగుతోంది. వంతెనపై ప్రమాదకర స్థితిలో ఎర్రకాలువ నీరు చేరడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. నిడదవోలు రోడ్ ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) నిర్మాణ పనుల దృష్ట్యా అధికారులు నిడదవోలు నుంచి తాడేపల్లిగూడేనికి సింగవరం మీదుగా తాళ్లపాలెం రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నుంచి కార్లు, బైక్‌లను మళ్లించారు. అయితే, ఎర్ర కాలువ సమీపంలో ఉండటంతో ఈ బ్రిడ్జి వద్దకు కూడా నీరు చేరింది. తప్పని పరిస్థితుల్లో వాహనదారులు ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్నారు.



శెట్టిపేట - తాళ్లపాలెం మధ్య రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నిలిచిన వరద నీరు

వేదాల ప్రాశస్త్యాన్ని విశ్వవ్యాప్తంగా చాటాలి

సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణ

అంబాజీపేట: భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టే వేదాల ప్రాశస్త్యాన్ని విశ్వవ్యాప్తంగా చాటాలని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకట రమణ అన్నారు. అంబాజీపేట మండలం నందంపూడిలో వడ్లమాని లక్ష్మీనారాయణ అవధాని స్మృత్యర్థం ఆయన కుమారుడు సుబ్రహ్మణ్య ఘనపాఠి ఆధ్వర్యాన వడ్లమాని లక్ష్మీనారాయణ మెమోరియల్ ట్రస్ట్ పేరిట మంగళవారం వేద సభ నిర్వహించారు. మహామహోపాధ్యాయ, శాస్త్రనిధి విశ్వనాథ గోపాలకృష్ణశాస్త్రి అధ్యక్షతన జరిగిన ఈ సభలో జస్టిస్ రమణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సంస్కృతీ సంప్రదాయాలకు భారతదేశం, కోనసీమ వేద పండితులకు పుట్టినిల్లని అన్నారు. వేద పండితులకు ఎన్నో ఆర్థిక సమస్యలున్నాయని, అయినప్పటికీ వేదాల ప్రాశస్త్యాన్ని, అర్థాలను సమాజానికి చాటి చెబుతున్నారని అన్నారు. ఇలాంటి వేదసభలు గ్రామ స్థాయిలో కాకుండా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో నిర్వహిస్తే వేదాల ప్రాశస్త్యాన్ని విశ్వవ్యాప్తంగా చాటి చెప్పడంతో పాటు వేదాలకు, వేద పండితులకు ఎంతో గుర్తింపు లభించి, వారి ఆర్థిక సమస్యలు తీరుతాయని చెప్పారు. ఈ సందర్భంగా జస్టిస్ రమణ సమక్షంలో వేద పండితులు సుమారు గంటసేపు వేదస్వస్తి గావించారు. అనంతరం వేద పండితులను సత్కరించారు. తొలుత సుబ్రహ్మణ్య ఘనపాఠి ఆధ్వర్యాన వేద పండితులు జస్టిస్ రమణకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీటీడీ ఆస్థాన వేద పండితులు ఉపాధ్యాయుల కాశీపతి సోమయాజి ఘనపాఠి, టీటీడీ దేవస్థానం శ్రీ వెంకటేశ్వర హయ్యర్ వేదిక్ స్టడీస్ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ దువ్వూరి ఫణి యజ్ఞేశ్వరయాజులు, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పీకే రావు, పేరి శ్రీనివాస్, అధిక సంఖ్యలో వేద పండితులు పాల్గొన్నారు.



రవితేజ ఘనపాఠికి సింహతలాటం అలంకరిస్తున్న జస్టిస్ రమణ

నా జన్మ ధన్యం

ఈ సందర్భంగా జస్టిస్ రమణ కొద్దిసేపు సుబ్రహ్మణ్య ఘనపాఠితో ముచ్చటించారు. తాను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నప్పుడు సుబ్రహ్మణ్య ఘనపాఠితో తీయించుకున్న ఫొటోలను ఆయన నివాసంలో చూసి, పాత జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. వెంకటేశ్వరస్వామి దయ వల్లే తాను తన పదవిని ఎంతో సమర్థంగా నిర్వహించానని, భగవంతుని ఆశీస్సులతో పాటు వేద పండితుల ఆశీస్సులు మెండుగా ఉన్నాయని అన్నారు. చిన్నతనం నుంచీ వేదపండితుల మధ్య కూర్చొని వేద ఘోషను ఆస్వాదించాలనే తన జీవిత కాల కోరిక నెరవేరిందని తన్మయత్వానికి లోనయ్యారు. వేదపఠనాన్ని ఆస్వాదిస్తూ, ఎంతో పులకించిపోయానని, మానసికంగా ఎన్నడూ పొందని ఆనందాన్ని పొందానని అన్నారు. లక్ష్మీనారాయణ అవధాని మెమోరియల్ ట్రస్టుకు రూ.2 లక్షల విరాళం ప్రకటించారు. వడ్లమాని సుబ్రహ్మణ్య అవధాని మనుమడు, ప్రముఖ వేద పండితుడు ఉపాధ్యాయుల సుబ్రహ్మణ్య రవితేజ ఘనపాఠికి జస్టిస్ రమణ సింహతలాటం అలంకరించి సత్కరించారు.

● దళారుల దందా

పెళ్లి బృందాలకు క్షవర కల్యాణం

- రత్నగిరిపై వివాహ మండపాలు, సత్రం గదులు ఇప్పిస్తామని మోసాలు
- తాజాగా ఈఓకు ఓ బాధితుడి ఫిర్యాదు
- దేవస్థానం సిబ్బంది సహకారంపై సందేహాలు



ఉచిత కల్యాణ మండపాల్లో వివాహాల సందడి



అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో పేదలు తమ బిడ్డల వివాహాలు చేసుకునేందుకు వీలుగా రత్నగిరిపై పలువురు దాతలు ఉచిత కల్యాణ మండపాలు నిర్మించారు. కానీ, వీటి కేటాయింపులో దళారుల దందా సాగుతోంది. వారికి కొంతమంది దేవస్థానం సిబ్బంది అండదండలు ఉండటంతో పేదలకు ఉచిత కల్యాణ మండపాలు లభించడం దుర్లభంగా మారుతోంది. ఇటీవల జరుగుతున్న సంఘటనలే ఈ విషయాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. ఉచిత కల్యాణ మండపాల కేటాయింపును దేవస్థానం అధికారులు సక్రమంగా పర్యవేక్షించకపోవడంతో దళారులు, కొంత మంది సిబ్బంది ఒక్కటై వివాహ బృందాలను దోచుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. తాజా ఉదంతమే దీనికి ఉదాహరణ.

రూ.25 వేలకు ఒప్పందం

పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండకు చెందిన తోట నాగతేజ గత శనివారం రాత్రి రత్నగిరిపై వివాహం చేసుకున్నారు. ఈ వివాహ ఏర్పాట్ల కోసం ఆయన గత ఆగస్టులో దేవస్థానానికి వచ్చారు. మట్టే వారి సత్య శ్రీనివాస ఉచిత కల్యాణ మండపంలో ఏసీ కల్యాణ మండపం, పక్కనే సత్రంలో రెండు ఏసీ గదులు, పురోహితుడు, సన్నాయి మేళం కోసం దేవస్థానం సీఆర్ఓ కార్యాలయాన్ని సంప్రదించారు. సత్రం గదులు, వివాహ మండపం వివాహానికి నెల రోజులు ముందుగా మాత్రమే రిజర్వేషన్ చేస్తారని అక్కడి అధికారులు చెప్పారు. అక్కడి నుంచి నాగతేజ వెలుపలకు రాగానే అశోక్, పోరి అనే ఇద్దరు దళారులు అతడి వద్దకు వెళ్లారు. అక్టోబర్ 11 వివాహానికి గదులు, వివాహ మండపం సెప్టెంబర్ 11న వస్తే రిజర్వ్ చేస్తారని చెప్పారు. ఆయన రానవసరం లేకుండా అన్నీ తామే ఏర్పాటు చేస్తామని, రూ.25 వేలు ఇవ్వాలని చెప్పారు. ఆ మాటలు నమ్మిన నాగతేజ.. వారికి తన, పెళ్లి కుమార్తె ఆధార్ నకళ్లతో పాటు శుభలేఖ, రూ.15 వేల నగదు ఇచ్చారు. మిగిలిన రూ.10 వేలు వివాహ సమయంలో ఇస్తామని చెప్పారు. అయితే, వివాహం చేసుకునేందుకు గత శనివారం దేవస్థానానికి వచ్చిన నాగతేజకు నాన్ ఏసీ కల్యాణ మండపం, రెండు నాన్ ఏసీ గదులు మాత్రమే ఇచ్చారు. దీంతో, అతడు దళారులకు రూ.10 వేలకు బదులు రూ.7,500 మాత్రమే ఇచ్చారు. మిగిలిన రూ.2,500 కూడా ఇవ్వాలని దళారులు గొడవకు దిగడంతో నాగతేజ పెళ్లి దుస్తుల్లోనే వెళ్లి ఈఓ వీర్ల సుబ్బారావుకు ఫిర్యాదు చేశాడు. దళారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ వివాదం సంగతి అలా ఉంచితే.. ఈ ఎపిసోడ్‌లో అసలు వ్యక్తులు రాకుండా దళారులు ఆధార్ కార్డులు ఇస్తే వివాహ మండపం, సత్రంలో గదులు ఎలా రిజర్వ్ చేశారు? సీఆర్ఓ కార్యాలయ సిబ్బంది ప్రమేయం లేకుండా ఇది జరిగే పనేనా వంటి అనేక సందేహాలు కలుగుతున్నాయి.

నెరవేరని దాతల లక్ష్యం

అన్నవరం దేవస్థానంలో సత్యగిరిపై పెద్దాపురానికి చెందిన శ్రీ లలితా రైస్ ఇండస్ట్రీస్ ఎండీ మట్టే శ్రీనివాస్ దంపతులు 2022లో 12 మినీ కల్యాణ మండపాలతో పెద్ద ఏసీ కల్యాణ మండపం నిర్మించారు. ఇదేవిధంగా విశాఖపట్నానికి చెందిన దాత ఎంఎస్ రెడ్డి కూడా 12 మినీ కల్యాణ మండపాలతో పెద్ద కల్యాణ మండపం నిర్మించారు. ఈ రెండు మండపాల్లో చెరో తొమ్మిది మినీ కల్యాణ మండపాల కేటాయింపును దేవస్థానానికి అప్పగించారు. మిగిలిన చెరో మూడు మండపాలను దాత సిఫారసు మేరకు కేటాయిస్తారు. ఈ మండపాల్లో పెళ్లిళ్లు చేసుకునే వారు రూపాయి కూడా అద్దె చెల్లించనవసరం లేదు. అలాగే, ఒక్కో వివాహానికి రెండు గదులను దేవస్థానం అద్దె ప్రాతిపదికన ఇస్తుంది. వివాహ ముహూర్తానికి నెల రోజుల ముందు మాత్రమే ఈ కల్యాణ మండపాలను రిజర్వ్ చేస్తారు. ఈ విషయం తెలియక చాలామంది వివాహానికి చాలా రోజుల ముందే వస్తున్నారు. తీరా విషయం తెలిశాక మళ్లీ రాలేకపోతున్నారు. అటువంటి వారిని గుర్తించి, దళారులు వల విసురుతున్నారు.

ఇలా చేస్తే మేలు

- దేవస్థానంలో వివాహ మండపాలు, సత్రం గదుల కేటాయింపుపై ఎటువంటి ప్రచారమూ లేదు. వీటిని వివాహాలకు నెల రోజుల ముందు మాత్రమే కేటాయిస్తారని ఫ్లెక్సీలు, మైకుల ద్వారా ప్రచారం చేయాలి.
- సీఆర్ఓ కార్యాలయంతో పాటు దేవస్థానంలో దళారులు లేకుండా చర్యలు తీసుకోవాలి. వివాహ మండపాలు కేటాయించాలంటే పెళ్లి బృందం సభ్యులు సరిగ్గా నెల రోజుల ముందు మాత్రమే సీఆర్ఓ కార్యాలయం వద్దకు రావాలంటూ ప్రకటనలు చేయాలి.
- వివాహ బృందాల వారికి అవసరమైన సమాచారం ఇచ్చేందుకు టోల్ ఫ్రీ నంబరు ఏర్పాటు చేయాలి. ఆ నంబర్‌పై విస్తృత ప్రచారం చేయాలి.
- వివాహాల సీజన్‌లో ఈఓ, ఇతర ఉన్నతాధికారులు తరచుగా వివాహ మండపాలు, సీఆర్ఓ కార్యాలయంలో తనిఖీలు చేయాలి. పెళ్లి బృందాల అభిప్రాయాలు తెలుసుకుని, వారి సూచనల మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలి.
- ఉచిత వివాహ మండపాలు కేటాయించడానికి ముందు, వివాహం అయ్యాక ఎవరైనా డబ్బులు డిమాండ్ చేశారా అనే విషయమై ఆరా తీసి, ఆ మేరకు చర్యలు చేపట్టాలి.

క్లుప్తంగా

హరిప్రియకు అభినందనలు


హరిప్రియను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

అంబాజీపేట: జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ ఆరో తరగతి విద్యార్థిని కుడుపూడి కావ్య సుందరి హరిప్రియను మంగళవారం ప్రధానోపాధ్యాయుడు కడలి సాయిరామ్ అభినందించారు. బాపట్ల జిల్లా పేటేరు హైస్కూల్లో ఈ నెల 10 నుంచి 12 వరకు జరిగిన తైక్వాండో రాష్ట్ర స్థాయి పోటీల్లో 20 కేజీల విభాగంలో హరిప్రియ మొదటి స్థానంలో నిలిచి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. కార్యక్రమంలో పీడీ కుంపట్ల ఆదిలక్ష్మి, ఉమా మహేశ్వర రావు, పీఈటీ అందె సూర్యకుమారి, కోచ్ త్రిమూర్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

దేవరపల్లి: జాతీయ రహదారిపై యర్నగూడెం గండి చెరువు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. పోలవరం మండలం కొత్తపట్టిసం గ్రామానికి చెందిన దొడ్డి నాగు (35) కొవ్వూరు మండలం పంగిడిలో నివాసం ఉంటున్నాడు. దొమ్మేరుకు చెందిన తాళ్ల అభిషేక్‌తో కలిసి నాగు బైక్‌పై విజయవాడలోని బంధువుల ఇంటికి బయలుదేరాడు. యర్నగూడెం సమీపంలో గండి చెరువు వద్ద హైవేపై వెళుతున్న క్వారీ లారీ సడన్‌గా సర్వీస్ రోడ్డులోకి వచ్చింది. దీంతో సర్వీస్ రోడ్డులో వెళుతున్న బైక్ అదుపు తప్పి లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో దొడ్డి నాగు తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అభిషేక్ తల, కాలికి బలమైన గాయాలు కావడంతో చికిత్స కోసం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు నాగుకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. అభిషేక్ అవివాహితుడు. నాగు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గోపాలపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. దేవరపల్లి సీఐ బీఎస్ నాయక్, ఎస్సై వి.సుబ్రహ్మణ్యం ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

భక్తులకు అన్నవరమై..

- అన్నవరప్పాడు వెంకన్న ఆలయానికి భక్తుల రద్దీ
- ప్రతి శనివారం అన్నదానం
- పెళ్లి భోజనంలా ఆహార పదార్థాలు
- నిత్యాన్నదానంగా మార్చేందుకు చర్యలు


అన్నవరప్పాడులో వేంకటేశ్వరస్వామి ఆలయం

పెరవలి: జాతీయ రహదారి పక్కనే పెరవలి మండలం అన్నవరప్పాడులో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయం నిత్య కల్యాణం పచ్చతోరణంలా వెలుగొందుతోంది. నిత్యం ఈ ఆలయానికి వేల మంది భక్తులు తరలివచ్చి, స్వామివారిని దర్శించుకుని పూజలు చేస్తున్నారు. ఇక్కడ ఏ కోరిక కోరుకున్నా తప్పక నెరవేరుతుందని భక్తుల నమ్మకం. ఆలయంలో ప్రతి శనివారం భక్తులకు అన్నసమారాధన నిర్వహిస్తారు. వేల మంది భక్తులు తరలివచ్చి, స్వామివారి అన్నప్రసాదం స్వీకరిస్తారు. అయితే కేవలం భక్తులు ఇచ్చిన విరాళాలతోనే ఈ కార్యక్రమం జరపడం ఇక్కడి ప్రత్యేకత.

ఆలయ చరిత్ర

అన్నవరప్పాడులోని వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం వెనుక పెద్ద చరిత్ర ఉంది. గ్రామానికి చెందిన ఓసూరి సోమన్న కలలో తిరుమలలో కొలువైన వేంకటేశ్వరస్వామి సాక్షాత్కరించి, ఈ దివ్యస్థలిలో ఆలయం నిర్మించాలని ఆదేశించారంట. ఆయన ఈ విషయాన్ని గ్రామ పెద్దలకు తెలపడంతో అందరూ స్వామివారి ఆజ్ఞను పాటించాలని నిర్ణయించుకున్నారు. గ్రామస్తుల సహకారంతో విరాళాలు సేకరించి 1965లో ఆలయ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఆనాటి నుంచి నేటి వరకు ప్రతి ఏటా వైశాఖ మాసంలో స్వామివారికి అంగరంగ వైభవంగా వారం రోజుల పాటు కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. పూర్వం ఇదే ప్రదేశంలో అత్రి మహర్షి తపస్సు చేసిన కారణంగా ఈ క్షేత్రానికి ఇంతటి తేజస్సు లభించిందని నమ్మకం.

అన్నదాన పథకం

ఆలయంలో ఐదేళ్ల క్రితం అన్నదాన పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకాన్ని కేవలం భక్తుల విరాళాలతో మాత్రమే నిర్వహిస్తున్నారు. స్వామివారి మూలధనం నుంచి ఒక్క పైసా కూడా వినియోగించరు. ప్రతి శనివారం నిర్వహించే ఈ అన్నదానానికి భక్తులు ముందస్తుగానే తమ విరాళాలు అందిస్తారు. ఆలయంలో ప్రతి శనివారం 6 వేల నుంచి 9 వేల మంది వరకు భక్తులు స్వామివారి ప్రసాదాన్ని స్వీకరిస్తారు. ప్రత్యేక రోజుల్లో వారి సంఖ్య మరో మూడు వేలకు పెరుగుతుంది.


అలివేలు మంగా పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి


అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు (ఫైల్)


స్వామి వారికి చక్రస్నానం చేయిస్తున్న అర్చకుడు (ఫైల్)

పెళ్లి భోజనంలా..

అన్నదాన పథకంలో భక్తులకు పెళ్లి భోజనం మాదిరిగా ఆహార పదార్థాలు వడ్డిస్తారు. పులిహోర, స్వీట్, రెండు రకాల కూరలు, పచ్చడి, సాంబారు, పెరుగుతో కలిపి కేవలం అరటి ఆకులోనే భోజనం పెడతారు. ఇక్కడకు వచ్చిన భక్తులతో పాటు వాడపల్లి క్షేత్రానికి వెళ్లి వస్తున్న వారు కూడా అన్నవరప్పాడులో ఆగి, అన్న ప్రసాదం స్వీకరిస్తారు. స్వామి వారికి ప్రతి ఏడాది వైశాఖ మాసంలో అంగరంగా వైభవంగా కల్యాణం జరుపుతారు. ఆ సమయంలో ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకూ వారం రోజుల పాటు అన్నదానం చేయడం విశేషం. ప్రస్తుతం ప్రతి శనివారం నిర్వహిస్తున్న అన్నదానాన్ని నిత్య అన్నదానంగా మార్చడానికి దేవదాయ ధర్మాదాయశాఖకు అనుమతులు కోరుతూ నివేదికలు సమర్పించారు.

విరాళాలు

అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి ఆలయంలో శాశ్వత అన్నదాన పథకం కింద ఇప్పటి వరకు రూ.4 లక్షల డిపాజిట్లు, బంగారం 376 గ్రాములు, 30 కిలోల వెండి ఆభరణాలు ఉన్నాయి. భక్తులు నిత్య గోత్రార్చన కింద రూ.12 లక్షలు డిపాజిట్లు ఉన్నాయి. ఇవి స్వామివారికి శాశ్వత డిపాజిట్లు కాగా, ప్రతి శనివారం నిర్వహించే అన్నదానం మాత్రం ఎప్పటికప్పుడు భక్తులు విరాళాలతో నిర్వహిస్తారు.

పెళ్లిళ్ల గుడి

ఆలయంలో ఏటా వేల సంఖ్యలో వివాహాలు జరుగుతూ ఉంటాయి. పెద్ద ముహూర్తాల సమయంలో ఆలయ ప్రాంగణంతో పాటు రోడ్లపైనే వివాహాలు జరుపుతారు. తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల నుంచి భక్తులు ఎక్కువగా తరలివస్తారు. అందుకే ఈ వెంకన్న సన్నిధి.. పెళ్లిళ్లకు చల్లని పెన్నిధి అని భక్తుల ప్రగాఢ విశ్వాసం. చాలామంది ఈ ఆలయాన్ని పెళ్లిళ్ల గుడిగా పిలుస్తారు.

ప్రతి వారం దర్శనం



అన్నవరప్పాడులో కొలువైన వేంకటేశ్వరస్వామిని ప్రతి శనివారం దర్శించుకుంటాను. దాదాపు పదేళ్లుగా ఆలయానికి వస్తున్నాను. ఇక్కడ భక్తులు కోరుకున్న కోరికలను స్వామివారు తప్పకుండా తీర్చుతారు.

– కావక పాపారావు, భక్తుడు, కాకరపర్రు

అన్నదానం బాగుంది



ఆలయంలో ప్రతి శనివారం నిర్వహించే అన్నదానం చాలా బాగుంది. వచ్చిన భక్తులందరికీ అన్న ప్రసాదం వడ్డిస్తారు. అది కూడా పెళ్లి భోజనంలా పెడతారు. ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతోంది.

– కంటిపూడి సూర్యనారాయణ, భక్తుడు, తీపర్రు

భక్తుల తాకిడి



ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. ప్రతి శనివారం నిర్వహించే అన్నదానాన్ని నిత్యాన్నదానంగా మార్చేందుకు అనుమతి కోసం ఉన్నతాధికారులకు నివేదించాం. 1965లో నిర్మించిన ఆలయం ప్రస్తుతం శిథిలస్థితికి చేరింది. దీంతో నూతన ఆలయ నిర్మాణానికి కూడా నివేదిక ఇచ్చాం.

– మీసాల రాధాకృష్ణ, ఆలయ ఈఓ, అన్నవరప్పాడు

గరుడ వాహనంపై మలయప్ప దర్శనం

- ఘనంగా వాడపల్లి వెంకన్న బ్రహ్మోత్సవాలు
- స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు


గరుడ వాహనంపై మలయప్ప అలంకరణలో ఊరేగుతున్న శ్రీవారు


వాడపల్లి క్షేత్రంలో కళాకారుల ప్రదర్శన

కొత్తపేట: వాడపల్లి క్షేత్రంలో భూసమేత వేంకటేశ్వరస్వామివారి వార్షిక దివ్య బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. దీనిలో భాగంగా ఐదో రోజు మంగళవారం శ్రీవారు మలయప్ప అలంకరణలో గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. రాష్ట్ర నలుమూలల నుంచి అత్యధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు బ్రహ్మోత్సవాలను వీక్షించి తరించారు. దేవదాయ ధర్మాదాయశాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు పర్యవేక్షణలో వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం ఖండవిల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంత శ్రీనివాస్, అర్చక బృందం, వివిధ ప్రాంతాల వేద పండితులు ఉదయం నుంచి రాత్రి వరకూ నిరంతరాయంగా స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు, హోమాలు, వాహనసేవ, ఊరేగింపులు జరిపారు.

గరుడ వాహనంపై శ్రీవారు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారు మలయప్ప అలంకరణలో గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పండితులు గరుడ వాహనంపై శ్రీవారు విహార ఘట్టం విశిష్టతను వివరించారు. కాగా..ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా బ్రహ్మోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, పలువురు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నేటి కార్యక్రమాలు

స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు బుధవారం నిత్య పూజలు, హోమాలు, అభిషేకాలతో పాటు తెల్లవారుజామున సుప్రభాత సేవ, నవనీత హారతి, ఉదయం అష్టోత్తర శతకలశాభిషేకం జరుగుతాయి. లక్ష తులసీ పూజ, శ్రీకృష్ణ అలంకరణలో సూర్యప్రభ వాహనసేవ, సాయంత్రం శ్రీలక్ష్మీ వేంకటేశ్వర మూలమంత్ర పూర్వక వేంకటేశ్వర హోమం, రాత్రి మోహినీ అలంకరణతో చంద్రప్రభ వాహన సేవ నిర్వహిస్తారు.

అప్పు తీర్చలేక స్నేహితుడి హత్య

- ఆపై భయంతో నిందితుడి ఆత్మహత్యాయత్నం
- వీడిన హత్యకేసు మిస్టరీ
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ శ్రీహరి రాజు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీహరి రాజు


పోలీసుల అదుపులో నిందితుడు రాజా రమేష్

ఏలేశ్వరం: తీసుకున్న అప్పు తీర్చాలని స్నేహితుడు ఒత్తిడి చేయడంతో అతడిని హత్య చేశాడో దుర్మార్గుడు. ఆపై పోలీసులకు దొరికిపోతాననే భయంతో పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఆస్పత్రిలో చేరిన అతడిని పోలీసులు విచారణ చేయడంతో హత్య కేసు మిస్టరీ వీడింది. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. అడ్డతీగల మండలం కొత్తూరుకు చెందిన బొదిరెడ్డి వెంకటేశ్వర్లు ఈ నెల 4న ఏలేశ్వరంలోని తన కుమారుడు ఆంజనేయులు ఇంటికి వచ్చాడు. అనంతరం ఇంటికి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమయ్యాడు. దీంతో తన తండ్రి కనిపించడం లేదంటూ ఆంజనేయులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే పురుగు మందు తాగి అడ్డతీగల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తిని పోలీసులు విచారణ చేయగా అతడే వెంకటేశ్వర్లును హత్య చేసినట్టు తేలింది.

కోడిపందేలకు పిలిచి..

బొదిరెడ్డి వెంకటేశ్వర్లుకు ఏలేశ్వరానికి చెందిన వల్లూరి రాజా రమేష్‌తో కోడి పందేల వద్ద స్నేహం కుదిరింది. ఈ నేపథ్యంలో వెంకటేశ్వర్లు నుంచి రాజా రమేష్ రూ.10 లక్షల వరకు అప్పు తీసుకున్నాడు. తన బాకీ తీర్చమని వెంకటేశ్వర్లు ఒత్తిడి తేవడంతో అతడిని కడతేర్చేందుకు రాజా రమేష్ నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలో నర్సీపట్నంలో కోడి పందేలు ఉన్నాయని చెప్పి, తనతో కారులో వెంకటేశ్వర్లును తీసుకుని బయలుదేరాడు. మార్గం మధ్యలో మత్తు మందు కలిపిన డ్రింక్‌ను వెంకటేశ్వర్లుకు ఇచ్చాడు. అది తాగి అపస్మారక స్థితిలోకి చేరుకున్న అతడిని హత్య చేసి, అతని వద్ద ఉన్న డబ్బు, బంగారం తీసుకున్నాడు. బురదరాళ్ల ఘాట్ రోడ్డులోని బొంతువలస గ్రామం వద్ద తుప్పల్లో మృతదేహాన్ని పారవేసి వెళ్లి పోయాడు. ఆ డబ్బుతో తాను తీసుకున్న బాకీలను తీర్చాడు. అయితే హత్య కేసులో పోలీసులకు దొరికిపోతాననే భయంతో రాజా రమేష్ పురుగు మందు తాగాడు. ఆస్పత్రిలో చేరిన అతడిని విచారణ చేసిన పోలీసులకు జరిగిన సంఘటన వివరించాడు. చికిత్స అనంతరం ఈ నెల 13న కోలుకోగా ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావు అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం ప్రత్తిపాడు కోర్టుకు తరలించారు.

వంట గ్యాస్ లీకై ముగ్గురికి గాయాలు


గాయాల పాలైన బాధితుడు

పిఠాపురం: మల్లాం గ్రామంలోని ఒక ఇంట్లో వంట గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో మల్లెపాముల వీర నాగేశ్వరరావు ఇంట్లో పని చేస్తుండగా మంగళవారం అకస్మాత్తుగా గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. దీంతో అతడితో పాటు, భార్య నాగలక్ష్మి, తమ్ముడు లోవరాజుకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స కోసం పిఠాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. ప్రమాద సమయంలో ఇంట్లో ఐదుగురు ఉన్నట్టు సమాచారం. చిన్న పిల్లాడు ఏడుస్తుండడంతో ఆ బాలుడితో పాటు మరో వ్యక్తి బయటకు రావడంతో ప్రమాదం నుంచి బయటపడ్డారు.

సంప్రదాయాలపై అవగాహన అవసరం


సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ


నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

- నన్నయ వీసీ ఆచార్య ప్రసన్న శ్రీ
- వర్సిటీలో ఘనంగా యువజనోత్సవాలు

రాజానగరం: చదువుతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంచుకోవాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని జాతీయ యువజనోత్సవాలలో భాగంగా జిల్లా యువజన సర్వీసుల శాఖ, సెట్రాజ్ (కాకినాడ) ఆధ్వర్యంలో ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం యువజనోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా యువజన సర్వీసుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్‌వీడీఎస్ రామకృష్ణ మాట్లాడుతూ యువతలోని ప్రతిభను ప్రోత్సహించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా 15 ఏళ్ల నుంచి 29 ఏళ్ల వయసున్న 944 మంది విద్యార్థులు జానపద నృత్యం, జానపద గేయాలు, స్టోరీ రైటింగ్, పోస్టర్, ఫొటోగ్రఫీ, ఉపన్యాసం, పర్యావరణ పరిరక్షణ మున్నగు వాటిలో పోటీ పడ్డారు.

విజేతలు వీరే..

- ఇన్నోవేషన్ ట్రాక్ (సైన్స్ మేళా ప్రదర్శన)లో వంగ అయ్యప్ప గ్రూప్ ప్రథమ, షేక్ మోనినా గ్రూప్ ద్వితీయ, జానపద నృత్యం (గ్రూప్)లో ఎస్ఆర్ఎస్ గ్రూప్ ప్రథమ, వై.జానీ ఏంజెల్ గ్రూప్ ద్వితీయ, పి.డోలా స్రవంతి గ్రూప్ తృతీయ స్థానాల్లో నిలిచాయి.
- జానపద గేయాల విభాగంలో తాతరాజు గ్రూప్ ప్రథమ, ఎ.మొలరాజు గ్రూప్ ద్వితీయ, వై.జానీ ఏంజెల్ గ్రూప్ తృతీయ స్థానాలు సాధించాయి.
- ఉపన్యాసంలో విధూషీ శాండిల్య ప్రథమ, జి.ధ్రువిత్ ద్వితీయ, వైష్ణవి కొల్లిమల్ల తృతీయ, కథ రాయడంలో వీబీ జ్ఞాన షర్మిల ప్రథమమ, అపూర్వ కొచ్చే ద్వితీయ, ఎ.లాలస్య తృతీయ బహుమతులు సాధించారు.
- పెయింటింగ్‌లో మహ్మద్ సమీర్, డి.వెంకట త్రివిక్రమ్, కె.లాజర్ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. కవిత్వంలో జి.ధ్రువిత్ ప్రథమ, బోడా హాసిని ద్వితీయ స్థానాలు సాధించారు. ప్రథమ స్థానంలో నిలిచిన విజేతలు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని సెట్రాజ్ సీఈఓ కాశీ విశ్వేశ్వరరావు తెలిపారు.

రామేశంపేట మెట్టలో అక్రమ మైనింగ్

- ఆగే వరకూ పోరాటం చేస్తాం
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరావు


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరావు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): మైనింగ్ మాఫియా ఆగడాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అన్నారు. స్థానిక బీజేపీ జిల్లా కార్యాలయంలో మంగవారం పెద్దాపురం మండలం రామేశం పేట మెట్టలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై విలేకర్ల సమావేశం నిర్వహించారు. రామేశంపేటలో అక్రమ మైనింగ్ జరుగుతోందని తనకు 60 ఫిర్యాదులు అందాయన్నారు. తాను స్వయంగా అక్కడ వెళ్లగా అనధికార మైనింగ్ జరుగుతోందన్నారు. దానిపై కలెక్టర్‌కు, మైనింగ్ శాఖ డీడీ నరసింహారెడ్డికి ఫిర్యాదు చేశానన్నారు. కానీ అధికారులు చర్యలు తీసుకోవడంలో వెనకడుగు వేస్తున్నారన్నారు. ఇటీవల గ్రావెల్ వాహనం ఢీకొని కళాశాల విద్యార్థి మృతి చెందాడన్నారు. ప్రస్తుతం అక్రమ మైనింగ్ కారణంగా కొండలు రోజురోజుకీ తరిగిపోతున్నాయన్నారు. అధికారుల లెక్కల ప్రకారం 900 ఎకరాల్లో కేవలం 260 ఎకరాలకు మాత్రమే అనుమతి ఇచ్చారన్నారు. మిగిలినదంతా అనధికారికంగా జరుగుతోందన్నారు. రామేశంమెట్టలో అక్రమ మైనింగ్ ఆగే వరకూ బీజేపీ పోరాటం చేస్తుందన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు కుండల సాయి, మొసలగంటి సురేష్ , చోడిశెట్టి రమేష్‌బాబు పాల్గొన్నారు.

సాంబార్ పాత్రలో పడి వ్యక్తికి గాయాలు

కాకినాడ క్రైం: మద్యం మత్తులో సాంబార్ పాత్రలో పడిన ఓ వ్యక్తి తీవ్ర గాయాల పాలయ్యాడు. వివరాల్లోకి వెళితే.. భీమవరానికి చెందిన కనికుళ్ల సునీల్ కుమార్ అనే 30 ఏళ్ల వ్యక్తి గత ఆదివారం రాత్రి స్థానికంగా జరిగిన ఓ వివాహానికి మద్యం తాగి వెళ్లాడు. మద్యం మత్తులో పెళ్లి మండపానికి సమీపంలో ఉన్న వంటశాల వైపు వెళ్లాడు. అక్కడ సుమారు 1500 మందికి సరిపడే పరిమాణంలో వండి సిద్ధం చేసిన భారీ సాంబార్ పాత్రలో పడిపోయాడు. దాని వేడికి సునీల్ శరీరం దాదాపు 30 శాతం మేర కాలిపోయింది. అక్కడి వారు గమనించి స్థానిక ఆసుపత్రిలో చేర్పగా, వైద్యులు మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం సునీల్ కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు.

ఆస్పత్రి నుంచి ఇంటికి వెళుతుండగా గుండెపోటు

కాకినాడలో దివ్యాంగుడి మృతి

కాకినాడ క్రైం: వైద్యం చేయించుకొని ఆసుపత్రి నుంచి స్వగ్రామానికి వెళుతున్న దివ్యాంగుడు బస్సెక్కుతూ గుండెపోటుతో మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. మలికిపురం మండలం గూడపల్లి గ్రామంలోని గొల్లమండల వారి వీధికి చెందిన ఇనమర్తి ఎల్లయ్య (42) కొన్నాళ్ల క్రితం కొబ్బరి పీచు ఫ్యాక్టరీలో పనిచేస్తుండగా ప్రమాదం వాటిల్లి ఎడమ కాలు కోల్పోయాడు. నాటి నుంచి అనేక కష్టాలతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో 9 నెలలుగా మూత్రం రాక ఇబ్బంది పడుతున్నారు. గత వారంలో కాకినాడకు వచ్చి రామారావు పేటలోని సుధా యూరాలజీ ఆసుపత్రిలో చేరి శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. మంగళవారం మధ్యాహ్నం పూర్తిగా కోలుకొని సంతోషంతో స్వగ్రామానికి భార్య పద్మతో కలిసి పయనమయ్యాడు. కాకినాడ బస్టాండ్‌కు వెళ్లి బస్సు ఎక్కుతుండగా గుండెపోటు రావడంతో ఎల్లయ్య కుప్పకూలిపోయాడు. దీంతో భార్య అక్కడి వారి సాయంతో హుటాహుటిన కాకినాడ జీజీహెచ్‌కు తరలించింది. అయితే వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారణ చేశారు. ఈ ఘటనపై కాకినాడ టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.